## ఆదిలాబాద్ రీజియన్‌కు ఆరు బస్సులు



నిర్మల్ డిపోకు చేరిన నూతన బస్సులు

నిర్మల్ అర్బన్, జనవరి 4 : ఆదిలాబాద్ రీజియన్‌కు ఆరు నూతన బస్సులు మంజూరయ్యాయి. ఇందులో ఎక్స్‌ప్రెస్, రాజధాని బస్సులు ఉన్నాయి. 15 లక్షల కిలో మీటర్లు పూర్తి చేసినందున రీప్లేస్‌మెంట్‌లో భాగంగా ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ రీజియన్‌లోని నిర్మల్ డిపోకు రెండు రాజధాని బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్.. ఆసిఫాబాద్ డిపోకు ఒక రాజధాని, ఒక ఎక్స్‌ప్రెస్.. మంచిర్యాల డిపోకు ఎక్స్‌ప్రెస్ బస్సును కేటాయించారు. త్వరలో ఇవి ప్రయాణికులకు సేవలు అందిస్తాయని తెలిపారు.

## క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఎదులాపురం, జనవరి 4 : ఆదిలాబాద్ క్యాంపు కార్యాలయంలోకి గురువారం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుటుంబ సమేతంగా ప్రవేశించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉజ్వల పథకం కింద మంజూరైన గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసుకుందాం..

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్
- రూ.12 కోట్లతో బీటీ రోడ్డు పనులు ప్రారంభం



బండల్ నాగపూర్‌లో బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్

తాంసి, జనవరి 4 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం బండల్ నాగపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీరామ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, షెడ్లను ప్రారంభించారు. రూ.12 కోట్లతో కప్పర్ల నుంచి పొచ్చెర వరకు.. బండల్ నాగపూర్ నుంచి సావర్గం, పొన్నరి వరకు నూతనంగా నిర్మించనున్న రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా హస్సేన్-హుస్సేన్ దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాటిపల్లి రాజు, ఎంపీపీ సురకుంటి మంజుల, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు సదానందం, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### అర్హులకు పథకాలు అందించాలి..

భీంపూర్, జనవరి 4 : ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం భీంపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొని, దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ధనోరాలో బీఆర్‌ఎస్ నాయకుడు మహేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ హరీశ్, ఎంపీవో వినోద్, వైద్యాధికారి నిఖిల్‌రాజ్, జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య , సర్పంచ్‌లు ఉన్నారు.

## సదర్మాట్ ఆయకట్టుకు నీటి విడుదల

ఖానాపూర్ రూరల్, జనవరి 4 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి గ్రామంలో గురువారం సదర్మాట్ కాలువ నీటిని స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయకట్టు చివరి వరకు నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పంట కోత దశలో కూడా నీటిని విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్, సర్పంచ్ రాజేందర్, మండల శాఖ అధ్యక్షుడు దయానంద్, అధికారులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్‌లోని జాతీయ రహదారి పక్కన దీక్ష చేస్తున్న రైతులు, నాయకులు

# ఇథనాల్ రగడ

## పరిశ్రమను ఏర్పాటు చేయవద్దని నిరసన

- ఎన్‌హెచ్-61 పక్కన టెంట్ వేసుకొని దీక్ష
- నాలుగు గ్రామాల నుంచి తరలివచ్చిన 2 వేల మంది
- వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు..
- దాదాపు 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- స్వచ్ఛందంగా బంద్ పాటించిన దుకాణాదారులు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- రిలే నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్న ప్రజలు, అన్నదాతలు
- ప్రతి గ్రామం నుంచి పది కుటుంబాలు నిత్యం పాల్గొనేలా కార్యాచరణ

దిలావర్‌పూర్, జనవరి 4 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని ప్రజలు, రైతులు బంద్‌కు పిలుపును ఇచ్చారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో గురువారం దుకాణాలను బంద్ చేశారు. ఎటువంటి ఘటనలు జరుగలేదు. ఉదయం 9 గంటలకే గుండంపల్లి, దిలావర్‌పూర్, న్యూ లోలం గ్రామాలకు చెందిన దాదాపు 2 వేల మంది రైతులు, ప్రజలు జాతీయ రహదారి-61పైకి తరలివచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు ఎన్‌హెచ్ పక్కనే టెంటు వేసుకుని కూర్చున్నారు. పోలీసుల అనుమతితో వంటావార్పు చేసుకున్నారు. రహదారి పక్కనే కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు. ఆందోళన సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దాదాపుగా 200 మంది బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం రైతులు, ప్రజలు ఇండ్లళ్లకు వెళ్లిపోయారు.

### రిలే నిరహార దీక్షలకు సిద్ధమవుతున్న రైతులు

నేటి(శుక్రవారం) నుంచి పరిశ్రమ రద్దు చేసే వరకు జాతీయ రహదారి-61 పక్కన శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేసేందుకు రైతులు కార్యాచరణ చేశారు. ప్రతి గ్రామం నుంచి 10 కుటుంబాలు నిత్యం రిలే నిరాహార దీక్షలో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. కాగా.. మా ప్రాణాలు తీసే ఇథనాల్ పరిశ్రమ మా గ్రామంలో వద్దని కోరుతూ ఐదేండ్ల చిన్నారి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. జాతీయ రహదారిపై కూర్చొని భోజనం చేసి నిరసన తెలిపింది. అనంతరం రైతులు మాట్లాడుతూ.. తమ పొట్టగొట్టే పరిశ్రమను రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి కూడా తమ ఉద్యమానికి సంఘీభావం తెలపాలని కోరారు.

### 60 మందిపై కేసు..

దిలావర్‌పూర్, జనవరి 4 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ స్థలాన్ని బుధవారం ముట్టడించి.. గోడలు కూల్చివేసి, ఫర్నీచర్ ధ్వంసం చేసి, వాహనాలకు నిప్పు పెట్టిన పలువురు రైతులు, యువకులపై కేసులు నమోదు చేసినట్లు దిలావర్‌పూర్ ఎస్‌ఐ యాసీర్ ఆరఫత్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కంపెనీ ఉద్యోగులు కే సందీప్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 60 మంది రైతులు, యువకులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పరిశ్రమ వద్ద విధులు నిర్వహించడానికి వచ్చిన లోకేశ్వరం మండలానికి చెందిన ఇంటెలిజెన్స్(ఎస్‌బీ) హెడ్‌కానిస్టేబుల్ లక్కపెల్లి జీవన్‌రావు, భైంసాకు(ఎస్‌బీ) కానిస్టేబుల్ జే శంకర్‌రావు సెల్ ఫోన్‌లు తీసుకుని ధ్వంసం చేసిన ఘటనలో ఇంటెలిజెన్స్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురు యువకులపై కూడా వివిధ సెక్షన్స్ కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులోనే కొందరిపై నాన్‌బెయిలబుల్ కేసులు కూడా పెట్టినట్లు తెలిపారు.




దిలావర్‌పూర్ మండల కేంద్రంలో మూసి ఉన్న దుకాణాలు



దిలావర్‌పూర్ జాతీయ రహదారిపైకి రాకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

# నాగోబా జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో అలంకరించాలి
- వీఐపీలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్‌లు ఉండాలి
- సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలి
- పోలీసు బందోబస్తు పెంచాలి
- కొవిడ్ నిబంధనలు తప్పనిసరి
- కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయి
- కెస్లాపూర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష



నాగోబా ఆలయంలో ఏర్పాట్లపై మెస్రం వంశీయులతో చర్చిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి

ఇంద్రవెల్లి, జనవరి 4 : వచ్చేనెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే నాగోబా జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి అన్నారు. గురువారం కెస్లాపూర్‌లోని నాగోబా దర్బార్‌హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు కల్పించే సదుపాయాలపై చర్చించి.. శాఖల వారీగా బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ నాగోబా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో అలంకరించాలని, వీఐపీలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, ఈ నెల 30వ తేదీకల్లా పనులన్నీ పూర్తవ్వాలని ఆదేశించారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాల కోసం పార్కింగ్ స్థలం సిద్ధం చేయాలని, తైబజార్‌తో పాటు ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాళ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. ఈ ఏడాది పోలీసుల సంఖ్య మరింత పెంచి బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. మెస్రం వంశీయులు సూచించిన అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నోడల్ అధికారుల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి 104, 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కొవిడ్ నిబంధనలు పాటించాలని, ర్యాపిడ్ యాక్షన్ బృందాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. విధులు నిర్వహించే అధికారుల పేర్లతో పాటు ఫోన్ నంబర్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు నాగోబా ఆలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పిఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, డీఆర్డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఐటీడీఏ మేనేజర్ రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీఎస్పీ నాగేందర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో పుష్పలత, సర్పంచ్ మెస్రం రేణుకానాగ్‌నాథ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, ఆలయ ఈవో రాజమౌళి, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ డీ సునీల్, మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం నాయకులు మెస్రం దేవ్‌రావ్, సోనేరావ్, శేఖర్‌బాబు, మెస్రం వంశీయులు నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, షేకు, తదితరులు పాల్గొన్నారు.



నాగోబాకు పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి



సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు



బాధ్యతలు స్వీకరిస్తున్న గౌస్ ఆలం

## ఆదిలాబాద్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 4 : ఆదిలాబాద్ జిల్లా నూతన ఎస్పీగా గౌస్ ఆలం గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు బదిలీపై వెళ్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. అంతకుముందు నూతన ఎస్పీ గౌస్ ఆలంకు జిల్లా పోలీస్ యంత్రాంగం పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను నూతన ఎస్పీ గౌస్ ఆలం మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలపై చర్చించారు.

## నిర్మల్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

### జానకీ షర్మిలకు స్వాగతం పలికిన పోలీసులు, సిబ్బంది



బాధ్యతలు స్వీకరిస్తున్న జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, జనవరి 4 : తెలంగాణ పోలీస్ అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జానకీ షర్మిల నిర్మల్ జిల్లా ఎస్పీగా బదిలీపై వస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమెకు బదిలీపై వెళ్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించారు. పలువురు పోలీసు అధికారులు, జగన్‌మోహన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా.. జానకీ షర్మిల 2007 సంవత్సరంలో గ్రూప్-1కు ఎంపికై.. మొదటగా 2009 సంవత్సరంలో కొవ్వూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2013లో కన్ఫర్మ్‌డ్ ఐపీఎస్‌గా పదోన్నతి పొందారు. 2018 నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా వస్తున్నారు. ఇదిలాఉండగా.. నిర్మల్ జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు నలుగురు ఎస్పీలు(విష్ణు ఎస్ వారియర్, శశిధర్ రాజు, చల్లా ప్రవీణ్‌కుమార్) పనిచేశారు. నాలుగో ఎస్పీగా తొలి మహిళ కావడం విశేషం.

# ఆరుతడిలో ఆదర్శం

## దశాబ్దాలుగా కూరగాయల సాగు

- లాభదాయక ఆకుకూరగాయల సాగుపై దృష్టి
- పట్టణాల్లోని పలు మార్కెట్లకు తరలింపు



ఆదిలాబాద్ మార్కెట్‌కు తరలించేందుకు దోసకాయలు, ఖోడద్ పొలం వద్ద కూరగాయలు విక్రయిస్తున్న పొన్నారి రైతు స్వామి

తాంసి, జనవరి 4 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి, హస్నాపూర్, కప్పర్ల.., తలమడుగు మండల కేంద్రంతోపాటు ఖోడద్, కజ్జర్ల, రుయ్యాడి గ్రామాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో దాదాపు 500 మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు. ఏండ్ల తరబడి కూరగాయలతోపాటు ఆరుతడి పంటలు, పాడి పరిశ్రమను చేపడుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ప్రధానంగా కొత్తిమీర, పుదీనా, మెంతి, పాలకూర, కొయ్యికూర, తోటకూర, బచ్చలికూర, సుక్క కూరతోపాటు అలుగడ్డ, చామగడ్డ, టమాట, బీర, చిక్కుడు, కాకర, బెండ సాగు చేస్తున్నారు. పంట ఉత్పత్తులను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైతుబజార్, కూరగాయల మార్కెట్లతోపాటు ఇతర మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆకుకూరలతోపాటు ఇంటి వరకు వరి కూడా పండిస్తున్నారు. ముఖ్యంగా భార్యాభర్తలు కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇతర గ్రామాల ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వరికి బదులుగా ఆరుతడి పంటలతోపాటు కూరగాయలను సాగు చేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

### 25 ఏండ్లుగా సాగు చేస్తున్న..



*వ్యవసాయ బావి వద్ద నాకున్న నాలుగెకరాల భూమిలో 25 ఏండ్లుగా 50 శాతం కూరగాయలు వేస్తున్నా. రోజు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆదిలాబాద్ మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతా. నీటి పారకం, ఖర్చు తక్కువ ఉంటుంది. సీజన్ బటి కూరగాయలు సాగు చేస్తే లాభాలు అధికంగా వస్తాయి.*

**- ప్రేమచంద్, రైతు, ఖోడద్, తలమడుగు మండలం**

### రెండింతలు సంపాదించవచ్చు..



*కూరగాయలు సాగు చేసే వారు ఓపికతో కష్టపడి పని చేస్తే పెట్టిన పెట్టుబడికి రెండింతలు సంపాదించవచ్చు. బావి, బోరు ఉంటేనే కూరగాయలు సాగు చేయవచ్చని కొందరు భయపడుతున్నారు. అరెకరం భూమిలో యేడాదిలో మూడు రకాల కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాం.*

**- అర్తుల రామయ్య, రైతు, తలమడుగు**